



మబ్బులు ముంచిపోసినట్లు...

బాహుబలి సినిమాలో రాజమౌళి గ్రాఫిక్ మాయాజాలాన్ని కంటిముందు ఆవిష్కరిస్తోంది తిరుపతిలోని కపిలతీర్థం జలపాతం. నింగిలోంచి నేలకు దూకుతున్నట్టుగా కనిపించి అలరిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తప్పిన 'మొంథా' ముప్పు!



కోట మండలం గోవిందపల్లిపాళెం వద్ద అలలతో ఎగిసిపడుతున్న సముద్రం

● తుఫాన్ ప్రభావంతో భారీ వర్ష సూచన ● 24 గంటలుగా ఒకటే వాన

జిల్లాకు మొంథా తుఫాను ముప్పు తప్పింది. అయితే దాని ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు సోమవారం రాత్రి నుంచీ మంగళవారం సాయంత్రం వరకూ ఆగకుండా వర్షాలు కురుస్తున్నాయి. తేలికపాటి వర్షాలు కావడంతో జిల్లాలో పెద్దగా ఆస్తి, పంట నష్టాలు సంభవించలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలో ఆగని వర్షం


జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారమంతా ఒక మోస్తరు వర్షం పడుతూనే ఉంది. దీనికి ఈదురుగాలులు తోడవడంతో చలితీవ్రత పెరిగింది. తిరుమలలో భక్తులు చలికి వణికిపోయారు. తిరుపతి రుయాస్పత్రిలోనూ రోగులకు అవస్థలు తప్పలేదు.

కూలిన ఇళ్లు.. చెట్లు

- ఏర్పేడు మండలం నచ్చినేరి ఎస్టీ కాలనీలో చిన్న తంబి, నాగరాజులకు చెందిన పూరిగుడిసెలు కూలిపోయాయి.
- రేణిగుంట-తిరుపతి నడుమ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
- తిరుమల బాలాజీనగర్‌లో భారీ వృక్షం అక్కడి కారుపై పడింది. మరో చెట్టు వాలిపోవడంతో రెండు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఎస్ఎన్సీ కాటేజీల వద్ద కూడా మరో వృక్షం కూలిపోయింది.
- పెళ్లకూరు మండలం పాలకూరు ఎస్టీ కాలనీలో యాకసిరి సునీత, తుపాకుల రంగమ్మలకు చెందిన పూరి గుడిసెలు కూలిపోయాయి.
- ఏర్పేడు మండలం చిన్న అంజిమేడులో చిత్తనూరు గీత కుటుంబానికి చెందిన పాడియావు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది.



తిరుపతి నగరం పాత ప్రసూతి ఆస్పత్రి రోడ్డులో కూలిన భారీ వృక్షం



కోట మండలం తిన్నెలపూడి వద్ద వరదనీటితో పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖినది

- జిల్లావ్యాప్తంగా 2756 చెరువులకు గానూ 300 చెరువులు పూర్తిగా నిండాయి. మరో 500 చెరువుల్లో ముప్పాతిక వంతు నీరు చేరింది. ● వెంకటగిరి మండలం కైవల్య నదిలో ప్రవాహం మొదలైంది. ● నాగలాపురం మండలం సురుటిపల్లి వద్ద అరుణానదిలో ఆరు అడుగుల మేరకు నీరు ప్రవహిస్తోంది.
- కేవీబీపురం మండలం ఒళ్యూరు రాయల చెరువు నిండి కలుజు పారుతోంది.
- స్వర్ణముఖి నది ఉధ్రుతంగా ప్రవహిస్తోంది.

ఇళ్లలోకి వర్షపు నీరు

- తిరుపతి లింగేశ్వరనగర్ నీట మునిగింది.
- శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారం రామాలయం వీధి జలమయమైంది. ఇళ్లలోకి నీరు ప్రవేశించింది.
- దక్కిలి మండలం దగ్గవోలు గిరిజన కాలనీలో గుడిసెల్లోకి నీరు చేరింది. దీంతో వారిని ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించారు.
- గూడూరు మండలం విందూరు ఎస్టీ కాలనీ వాసులను.. ఓజిలి మండలం గ్రద్దగుంట గిరిజన కాలనీ.. పెళ్ళకూరు మండలం కానూరు ఎస్సీ కాలనీ.. సత్యవేడు మండలం బాలగోపాలపురం ఎస్టీ కాలనీ.. వరదయ్యపాలెం మండలం బీజీఆర్ ఎస్టీ కాలనీ, పాండూరు నక్కలమిట్ట ఎస్టీ కాలనీ ప్రజలను ముందుజాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించారు.



భైరవగుంట చెరువుకు గండి

బీఎన్ కండ్రిగ మండలం కుక్కంబాకం భైరవగుంట చెరువుకు తూము వద్ద గండి పడింది. దీంతో నీరంతా వెలుపలికి ప్రవహిస్తోంది.

11 మండలాలకు భారీ వర్ష హెచ్చరిక

తుఫాను తీరం దాటనున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచీ బుధవారం వరకు 11 మండలాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. సముద్ర తీర మండలాలు, తీరానికి చేరువగా ఉన్న మండలాలైన గూడూరు, వాకాడు, కోట, చిల్లకూరు, చిట్టమూరు, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, తడ, సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. దానికి తగ్గట్టుగానే మంగళవారం మధ్యాహ్నం నుంచే జిల్లావ్యాప్తంగా గాలుల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా సముద్ర తీరానికి చేరువలో వున్న మండలాల్లో ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు మంగళవారం వాకాడు, చిల్లకూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతాలను పరిశీలించారు.

ఆగిన రాకపోకలు.. బస్సు సర్వీసుల రద్దు



సూళ్లూరుపేట మండలం దొండకాలువ వంతెనపై రెండడుగుల మేర ప్రవాహం

- తిరుపతి, సత్యవేడు, గూడూరు, వాకాడు, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం పది మార్గాల్లో 19 బస్సు సర్వీసులు రద్దయ్యాయి.
- మూడు మార్గాల్లో రోడ్లు పాడవడంతోనూ, మిగిలిన మార్గాల్లో కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతోనూ బస్సు సర్వీసులు నిలిపివేశారు.
- వరదయ్యపాలెం సీఎల్ఎన్ పల్లి పంచాయతీలో వాగు ప్రవాహ ఉధృతి పెరగడంతో రోడ్డు బ్రిడ్జిపైకి వరద నీరు చేరింది. దీంతో రాకపోకలు ఆపేసి కాపలా ఏర్పాటు చేశారు.
- కేవీబీపురం మండలం పూడి గ్రామాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు కొట్టుకుపోయింది.
- ఏర్పేడు మండలం కొత్తవీరాపురం- మోదుగులపాలెం నడుమ స్వర్ణముఖి నది ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిపివేసి పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.
- ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద సీత కాలువ ఉధృతి పెరగడంతో ఆలయానికి భక్తుల రాకపోకలను ఆపేశారు.
- వెంకటగిరి మండలం వెలిగొండ కొండల్లోని మల్లేశ్వర కోనకు భక్తులను అనుమతించకుండా పోలీసులు దారి మూసేశారు.

'మొంథా'పై అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్




తీరప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు

చిట్టమూరు, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా ప్రత్యేకాధికారి అరుణ్‌బాబుతో కలసి తీరప్రాంత గ్రామాల్లో పర్యటించారు. 'వాతావరణ సూచన ప్రకారం తుఫాన్ తీరం దాటే సమయానికి 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. వరద ప్రవాహమున్న కాజ్‌వేల వద్ద ప్రజలు రాకపోకలు సాగించొద్దు. చెరువు కట్టలు బలహీనంగా ఉన్న ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించాం. నీట మునిగిన పంటలను గుర్తించాలని సూచించాం. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దు. ఆస్తి, ప్రాణ నష్టం జరకుండా యంత్రాంగం సన్నద్ధంగా ఉంది' అని కలెక్టర్ తెలిపారు. చిట్టమూరు మండలం యల్లసిరి మేజర్ చెరువు కట్టలను పరిశీలించారు. గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను చూసి రైతులతో మాట్లాడారు. చిట్టమూరు నుంచి ముట్టెంబాకు వెళ్లే మార్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మల్లాం మార్గంలో వరద తాకిడి ఉన్న కాజ్‌వేల వల్ల గతేడాది ఇద్దరు కొట్టుకుపోయి మృతి చెందినట్లు స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంట గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, గూడూరు డీఎస్పీ గీతా కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వరావు ఉన్నారు.

● ప్రాజెక్టు రిపోర్టు

కాళంగి గేట్లు మూసివేత



తిరుపతి/కేవీబీపురం/రేణిగుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం లోతు 224 అడుగులు. మంగళవారానికి 217 అడుగుల నీటి మట్టం ఉంది. దీంతో గేట్లను మూసేశారు. ఒకవేళ మంగళవారం రాత్రికి నీటి మట్టం పెరిగితే 1, 2 గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

- రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంలో మంగళవారం ఉదయం 8 గంటలకు 800 క్యూసెక్కుల నీళ్లు చేరుతోంది. దీంతో గేట్లను ఒక అడుగు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు వదులుతున్నారు.
- వాకాడు మండలం స్వర్ణముఖి బ్యారేజీలోకి 3500 క్యూసెక్కుల నీరు వస్తుండగా 7 గేట్లు ఎత్తివేశారు.
- పిచ్చాటూరు మండలం అరణియార్ రిజర్వాయరులో 31 అడుగులకుగాను 28.7 అడుగులకు నీటి మట్టం చేరింది. 450 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుండగా రెండు గేట్లు ఎత్తివేసి 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.
- చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్‌లో 867 అడుగుల వరకూ నీటి మట్టం పెరిగింది.



కోట మండలం గూడలి వద్ద నీటమునిగి చెరువులా మారిన వరినారుమడులు

గూడూరులో అత్యధికం 72.8మి.మీ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 8గంటల వరకు సగటు వర్షపాతం 26.7మి.మీ. నమోదైంది. అత్యధికంగా గూడూరులో 72.8మి.మీ., అత్యల్పం పాకాల 8మి.మీ. వర్షపాతం నమోదైంది. చిల్లకూరు 57.6, కోట 51.8, ఓజిలి 49.6, వాకాడు 52.6, నాయుడుపేట 42.2, చిట్టమూరు 43.4, బాలాయపల్లి 36.2, డీవీసత్రం 31, పెళ్లకూరు 27, తడ 26, డక్కిలి 29, వెంకటగిరి 25.4, సత్యవేడు 23.4, సూళ్ళూరుపేట 23, శ్రీకాళహస్తి 22.8 మి.మీ. చొప్పున.. దాదాపు 17మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

రూ.240కోట్ల ఆస్తి నష్టం

మొంథా తుపాన్‌తో దాదాపు రూ.240కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు జిల్లా అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 17ఇళ్లు దెబ్బతినగా ఆరు పూరిగుడిసెలు నేలమట్టం అయాయి. మొత్తం 37 మూగజీవాలు మృతిచెందాయి. 13మండలాల్లో దెబ్బతిన్న పంచాయతీ రాజ్ రోడ్ల మరమ్మతులకు రూ.2.4కోట్లు అవసరం. ఆర్ అండ్‌బీకి 42 రోడ్లు దెబ్బతిన్నాయి. ఏపీఎస్పీడీసీఎల్‌కు సంబంధించి 126 కరెంటు స్తంభాలు.. 4.55కిలో మీటర్ల 11కేవీ వైర్లు దెబ్బదిన్నాయి. సుమారు రూ.57లక్షల మేర నష్టం వాటిల్లింది. జిల్లాలో 20 తుఫాన్ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో 2, శ్రీకాళహస్తిలో 9, గూడూరు 4, సూళ్ళూరుపేట 5చొప్పన మొత్తం 20 పునరావాసకేంద్రాలను ఏర్పాటుచేశారు. 285 కుటుంబాలకు చెందిన 728మంది ఆశ్రయం పొందుతున్నారు.

రూ.25 కోట్లతో కాణిపాకంలో వసతి సముదాయం

- టీటీడీ ఆస్పత్రులకు డాక్టర్ జగదీష్ ఒక్కరే డైరెక్టర్
- స్విమ్స్ ఆధ్వర్యంలోనే మెడికల్ షాప్ ● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద యాత్రికుల వసతి సముదాయం, ఏసీ, నాన్ ఏసీ కల్యాణమండపాల నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయించినట్టు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. నిధులు టీటీడీనే కేటాయించినప్పటికీ నిర్మాణం, నిర్వహణ కాణిపాకం ట్రస్టు బోర్డుదే బాధ్యతన్నారు. ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని నిర్ణయించామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులతో కలిసి మీడియాకు వెల్లడించారు. స్విమ్స్ పరిధిలోని కొన్ని మెడికల్ షాప్‌లు డూప్లికేట్ మెడిసిన్స్ విక్రయిస్తున్నట్లు పలు ఫిర్యాదులు వచ్చిన క్రమంలో స్విమ్స్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తే బాగుంటుందని నిర్ణయించామన్నారు. శ్రీవాణి ట్రస్టు దాతలు టికెట్లు తీసుకునేందుకు దాతలు ఇబ్బంది పడుతుండటంపై చర్చించామని, పదిరోజుల్లో ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ లెక్చరర్లు, డ్రైవర్ల క్రమబద్ధీకరణపై గత తీర్మానం సరైన పద్ధతిలో లేకపోవడంతో తాజాగా మరోసారి తీర్మానించామన్నారు. సీఎం ఆదేశాల మేరకు టీటీడీ పరిధిలోని ఆస్పత్రులకు డాక్టర్ జగదీష్ డైరెక్టర్‌గా ఉంటారని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఏఐ ద్వారా శ్రీవారి దర్శనాల అమలుపై ఇప్పటికే ఓ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, మరికొన్నింటి వినియోగంపై కమిటీని నియమించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో పనిచేసిన టీటీడీ శాశ్వత ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వారికి రూ.7,535 చొప్పున బహుమానం ఇవ్వాలని తీర్మానించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో పనిచేసిన తిరుమల, తిరుపతికి చెందిన సిబ్బందికి అదనంగా రూ.10 శాతం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. నవంబరు 17 నుంచి 25వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



యువత, కౌమార అభివృద్ధి జాతీయ పథకానికి
దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత, కౌమార అభివృద్ధి జాతీయ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో డాక్టర్ యశ్వంత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లాభాపేక్షలేని ప్రభుత్వేతర సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందేందుకు ఇదో చక్కటి అవకాశమన్నారు. అర్హులు నవంబరు నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9848543976నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన మైనార్టీ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ ఆర్థిక సంస్థ ఈడీ హరినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులై, రెండేళ్ల అనుభవమున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712655686ను సంప్రందించాలని తెలిపారు.

చంద్రగిరి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పలువురికి ఎమ్మెల్యే నాని సీఎం సహాయనిధిచెక్కులను అందజేశారు. నియోజకవర్గ పరిధిలో పలువురికి రూ.9,38,756 చెక్కుల రూపంలో అందజేశారు. లబ్దిదారులు, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే నానిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈ మార్గంలో చినుకు పడితే యాతన



కొత్తనెన్నూరు రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు

రామచంద్రాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్త నెన్నూరు ప్రజలు పదేళ్లుగా వర్షాకాలంలో నిండిన నీటిగుంతలతో చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద 15ఏళ్ల క్రితం వేశారు. ఐదేళ్ల తరువాత చిన్నపాటి గుంతలుగా ఏర్పడి పెద్దవయ్యాయి. రోడ్డు మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులను కోరినా ఈ రోడ్డు తమ పరిధిలో రాదని అంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో గుంతల్లో నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



స్తంభం వద్ద ఏర్పడిన గొయ్యి

చంద్రగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని ప్రాథమిక పాఠశాల వద్ద విద్యుత్ స్తంభం ప్రమాదకర స్థితిలో ఉంది. పాఠశాల వెనుక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీని పక్కనే స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఏర్పాటు చేస్తున్నప్పుడే పక్కన గోయి ఉంది. ఇటీవల వర్షాలకు స్తంభం కుంగిపోతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల విద్యార్థులు బయటకు రావాలన్నా భయపడుతున్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ



రెడ్డిచెరువు మొరవను పరిశీలిస్తున్న అధికారులు

భాకరాపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను దృష్ట్యా చిన్నగొట్టిగల్లు మండలంలోని పలు గ్రామాలలో ఎంపీడీవో గిడ్డయ్య, తహసీల్దారు భాగ్యలక్ష్మి పలు చెరువులను పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. చెరువులు మొరవలు పోయే ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. పాళెం పంచాయతీలోని రెడ్డి చెరువు మొరవ రోడ్డుపై వెళుతుండడంతో ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె, చిట్టేచర్ల గ్రామాల్లో చెరువులను పరిశీలించి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు చేశారు. కంట్రోలు రూములో ఎంపీడీవో గిడ్డయ్య, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

గొట్టిగంటి చెరువు సప్లై ఛానెల్ పరిశీలన



సప్లై ఛానెల్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర ప్రసాద్

భాకరాపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రెడ్డి చెరువు నుంచి చిన్నగొట్టిగల్లు చెరువుకు ఉన్న సప్లై ఛానెల్ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను ఇరిగేషన్ శాఖ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మూడు రోజులుగా భారీయంత్రాలతో మరమ్మతు పనులను చేస్తున్నారు. త్వరగా పూర్తి చేసి కాలువలో నీరు పారేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డీఈ సురేశ్ కుమార్, ఏఈ గిరీష్ కుమార్, పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడండి





పేరూరులో వరిపంట పరిశీలిస్తున్న సుబ్బారావు- నల్లమానికాలువలో నేలకు ఒరిగిన వరి

తిరుపతి రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) మండలంలో సాగుచేసిన వరిపంటను మండల వ్యవసాయాధికారి సుబ్బారావు మంగళవారం పరిశీలించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో పొల్లాలో నీరు నిల్వలేకుండా తీసుకోవల్సిన చర్యల గురించి రైతులకు సూచించారు. రబీసీజన్‌లో మండల పరిధిలో 400 ఎకరాల్లో వరి నాటారని, నారుమడి ఐదెకరాల్లో ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పదెకరాల్లో నాటిన వరిపంట కోతదశలో ఉందన్నారు. ఇందులో 5ఎకరాలో నష్టం జరిగే అవకాశముందన్నారు.120ఎకరాల్లో సాగుచేస్తున్న చెరకు పంటకు ప్రస్తుతానికి నష్టం లేదని వివరించారు.

దేశ ఐక్యతాయాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకల్లో భాగంగా యూనిటీ మార్చ్ ఏక్ భారత్ ఆత్మనిర్బర్ భారత్ పేరుతో దేశ ఐక్యతా యాత్రను నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచే విధంగా ఈ ఐక్యత కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి దశగా తిరుపతిలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు బాలాజీ కాలనీలోని జ్యోతీరావ్‌పూలే విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. వేలాదిమంది యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరువతారన్నారు. ర్యాలీ అనంతరం సభ జరుగుతుందన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటా: నాని

రామచంద్రాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు లోతట్టు ప్రాంత ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పులివర్తి నాని భరోసా ఇచ్చారు. తుఫాన్ నేపథ్యంలో సీకేపల్లి, కాలేపల్లి, సూరావారిపల్లె, పిళ్లారికోన గ్రామ ప్రజలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా రైతులు తమ పొలాలు నీట మునిగాయని విన్నవించారు. అందరినీ ఆదుకుంటానని హామీ ఇచ్చారు. పిళ్లారికొన చెరువుపూర్తిగా నిండి మొరవ పారడంతో ఎమ్మెల్యే జలహారతులు ఇచ్చారు. రాయల చెరువును పరిశీలించారు. రామాపురం పంచాయతీ ఎస్టీకాలనీలో చెట్టు మీద పడి పూరిగుడిసె కూలిపోయిన ఘటనలో రోజా, రమేష్ దంపతులకు ఎన్టీఆర్ హౌసింగ్ కింద పక్కాభవనం మంజూరు చేయించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో రామమోహన్, తహసీల్దారు మధుసూదన్‌రావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, చిన్నబాబు, జనార్ధన చౌదరి, కేశవులునాయుడు పాల్గొన్నారు.

యూనిటీ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ చేపట్టిన యూనిటీ మార్చ్ పోస్టర్లను ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. ఎస్వీయూ వీసీ చాంబర్‌లో మై భారత్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రదీప్ బెహరా, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణతో కలిసి వారు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 30వ తేదీ తిరుపతిలో మధ్యాహ్నం 2 గంటలకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి కచ్చపి ఆడిటోరియం దాకా ఈ మార్చ్ సాగుతుందన్నారు. అనంతరం నిర్వహించే సభలో మంత్రి సత్యకుమార్ పాల్గొంటారని తెలిపారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు మంగళవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన దుబా వరలక్ష్మి ఈ విరాళాన్ని ఇచ్చింది. ఈమేరకు విరాళం డీడీని తిరుమలలోని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు.

శరభయ్య యాదవ్ విగ్రహం ఏర్పాటుకు వినతి

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహంతో మఠాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహయాదవ్, వాసుదేవ యాదవ్ సంఘం తరపున టీటీడీ ఛైర్మన్ బీర్ నాయుడికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఛైర్మన్‌తో పాటు ఈవో అనిల్‌కుమార్‌ను కలిసి నరసింహయాదవ్ ఈమేరకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన శరభయ్య యాదవ్ విగ్రహాన్ని ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. మొట్టమొదట స్వామివారిని శరబయ్య చూశారన్నారు. ఆయన తర్వాత స్వామితో అనుబంధమున్న వారి విగ్రహాలు ఏర్పాటు చేశారు కానీ శరబయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోవడంపై యాదవులందరూ ఆవేదన చెందుతున్నారన్నారు.

తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



తిరుమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి తిరుమల జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీపంలోని ఏపీ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ కాంపౌండ్ వాల్ ఫెన్సింగ్‌కు టవల్‌తో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి చేతిపై హిందీ భాషలో ఉన్న పచ్చబొట్టు తప్ప మరే ఆధారాలు లభించలేదు. వివరాలు తెలిసిన వాళ్ల తిరుమల టూటౌన్ పోలీసులకు 94407 96772 నెంబరుకు తెలియజేయాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

భాకరాపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను నేపథ్యంలో అందుబాటులో లేకుండాపోయిన జంగావాండ్లపల్లె పంచాయతీ కార్యదర్శి రూపకు ఎంపీడీవో మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపూ రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనంతో అటవీ సిబ్బంది

భాకరాపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు రేంజర్ వెంకటరమణ తెలిపారు. తమ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బసన్నగారిపల్లె నుంచి ఉస్తికాయలపెంట, ఎర్రావారిపాళెం, భాకరాపేట మీదుగా ఎర్రచందనం అక్రమ రవాణ జరుగుతోందని సమాచారం అందిందన్నారు. దీంతో తలకోన మార్గంలోని నోవా క్వాలిటీ ఫుడ్ ఫ్యాక్టరీ సమీపంలో నిఘా పెట్టామన్నారు. ఓ ద్విచక్రవాహనం, కారు అటువైపు రాగా వాటిని ఆపామన్నారు. వాహనాలను నిలిపి ద్విచక్ర వాహనదారుడు చీకట్లో పారిపోగా కారులో ఉన్న అజిత్ కుమార్ మురళి అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. 265 కిలోల బరువున్న 8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిది వేలూరు జిల్లా పల్లియన్‌కుప్పం గ్రామం. దాడిలో ఎఫ్‌బీవోలు రాజేశ్ కుమార్, ప్రదీప్ చంద్, సదాశివయ్య, నిఖిల్, డ్రైవర్ శంకర్, రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మొంథాతో చెరువులకు జలకళ





కళకళలాడుతున్న పదిపుట్లబైలు చెరువు- కల్యాణి డ్యామ్

చంద్రగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మూలపల్లె చెరువు నిండు కుండలా ఉంది. ఇది చెరువు మంగళవారం రాత్రికి మొరవ పోతుందని అధికారులు భావిస్తున్నారు. ఎ.రంగంపేట సమీపంలోని కల్యాణి డ్యామ్ నీటిమట్టం 870 అడుగులకు చేరింది. స్వర్ణముఖి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మిట్టపాలెం, బుచ్చినాయుడుపల్లె వద్ద కల్యాణీ వాగు, ముక్కోటి, పులిత్తివారిపల్లె, నాగయ్యగారిపల్లెలల్లో నది వంతెనల వద్ద సీఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

పాకాల: వర్షాలకు పదిపుట్లబైలు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండిపోయి మొరవపోతోంది. సుమారు 350 ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీళ్లు అందిస్తున్న ఈ రిజర్వాయర్ నిండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన చెరువులు నిండి మొరవపోతున్నాయి. సోమవారం రాత్రి నుండి మంగళవారం రాత్రి వరకు తెరపి లేకుండా చిరుజల్లులు కురుస్తుండడంతో జనజీవనానికి ఇబ్బంది కలిగింది. పశువులు, మేకలు, గొర్రెలు మేతకు బయటకు వెళ్లకుండా ఇండ్లవద్దే వుండిపోయాయి. తహశీల్దార్ సంతోష్‌సాయి, ఎంపీడీవో వాసుదేవరావ్, సీఐ సుదర్శన ప్రసాద్ పరిస్థితులను పరిశీలిస్తున్నారు.

రోజంతా వీడని ముసురుతో ఇబ్బందులు



స్వర్ణముఖిలో వ్యర్థాల తొలగింపు



ఎర్రమరెడ్డిపాళెం చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుచానూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా ముసురు పట్టుకుంది. జనజీవనం స్తంభించింది. అక్కడక్కడ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్వర్ణముఖిలో వరద నీరు పెరగడంతో తాత్కాలిక వంతెన వద్ద చిక్కుకున్న చెత్తను పంచాయతీ కార్యదర్శి మణి నేతృత్వంలో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. షికారీ కాలనీలో వరద ప్రవాహాన్ని కలెక్టరేట్ వద్ద పొలాల వైపు మళ్లించారు. రేణిగుంట సమీపంలోని ఎర్రమరెడ్డిపాళెం చెరువు నిండి కలుజు పారుతోంది. చెరువు గండి పడిందని వదంతులు రావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అరుణ్‌బాబు పరిశీలించారు. వర్షపు జల్లులకు పద్మావతి అమ్మవారి భక్తులు ఇబ్బందులు పడ్డారు. **తిరుపతి రూరల్:** మల్లంగుంట గ్రామపంచాయతీపరిధిలోని పలు కాలనీల్లో మొంథా తుఫాన్‌పై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామటీడీపీనేత పార్లపల్లి మునికృష్ణారెడ్డి నేతృత్వంలో లోతట్టుప్రాంతంలోని కాలనీల్లో ప్రజల్ని చైతన్య పరిచారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్నకాలనీ ప్రజలు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని, అన్ని సదుపాయాలు కల్పించారని వివరించారు. కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి, కూటమినాయకులు పాల్గొన్నారు.

తూముల పూడిక తీతకు ఎమ్మెల్యే ఆదేశాలు



తాత్కాలిక వంతెన వద్ద పూడిక తొలగింపు పనులు



స్వర్ణముఖిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఆర్సీపురం మార్గంలో చిగురువాడ వద్ద స్వర్ణముఖినదిని ఎమ్మెల్యే పులివర్తినాని మంగళవారం పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో నీరు ఉధృతి దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు. తూముల వద్ద పూడికను తీసి కట్ట కోతకు గురికాకుండా చూడాలని స్థానిక నేతలకు చెప్పారు. దీంతో తాత్కాలిక వంతెన వద్ద నదిలోని బ్లాకేజీని తొలగించారు. వంతెన కింద ఏర్పాటు చేసిన పైపులకు అడ్డంగా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, ముళ్లచెట్లని తొలగించి నీరు ముందుకు కదిలే ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సదుపాయాలు కల్పించామని పంచాయతీ కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి పేర్కొన్నారు. డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్, మునిశేఖర్‌రాయల్, శ్రీనివాసులుయాదవ్, పాల్గొన్నారు.

పోలీసుల రక్తదాన శిబిరం



దాతలతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ హాలులో మంగళవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాతల నుంచి దాదాపు 580 యూనిట్లు రక్తం సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రక్తదాతలను అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందచేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు, ప్రజల భాగస్వామ్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని తిరుపతి ప్రసూతి ఆసుపత్రి, రుయా, స్విమ్స్ ఆసుపత్రులు, ఎన్టీఆర్ ట్రస్టు వారికి అందచేస్తామన్నారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, శ్రీలత, శ్రీనివాసులు, రామకృష్ణ, రామకృష్ణమాచ్చారి, రిజర్వు ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత మార్గాల్లో బస్ సర్వీసుల నిలిపివేత



బోసిపోయిన తిరుపతి బస్టాండు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో ఆర్టీసీ బస్ సర్వీసులను అధికారులు మంగళవారం రద్దుచేశారు. చెన్నై, వేలూరు, విజయవాడ, బెంగళూరులకు కొన్ని బస్సులను ఆపేశారు. తిరుపతి-సుండుపల్లి, వరదయ్యపాళెం - సంతవెల్లూరు, గూడూరు-చిలమత్తూరు, పన్నెపల్లి, పొదలకూరు, కోటనుంచి తూపిలిపాళెం, నాయుడుపేట- కుమ్మరిపాళెం, చిన్నతోట, మల్లం -శ్రీనివాసపురం, శ్రీకాళహస్తి -పెరిమిడి బస్సులను రెండు రోజులు పాటు నిలిపివేశారు. మొత్తం 19సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్య పలుచగా కనిపించింది. కార్గో పార్సిల్స్ బుకింగ్, డెలివరి సర్వీసులు కూడా బోసిపోయాయి. ఇదిలా ఉండగా బస్టాండులో మొండిగోడలు, ప్రవేశద్వారం వద్ద పెచ్చులూడుతుండడంతో. సిబ్బంది వెళ్లకుండా రక్షణ ఏర్పాట్లు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గురవయ్య(38) మృతి చెందాడు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన గురవయ్య విజయవాడకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాయుడు పేటలో దిగాడు. విన్నమాల వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గురవయ్య మృతి చెందాడు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

వెటర్నరీ అధ్యాపకుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

తిరుపతి(గాంధీరోడ్డు), అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీరనుంది. వర్సిటీ పరిధిలోని తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి కళాశాలల్లో కొన్నేళ్లుగా విద్యార్థులకు సంఖ్యకు దీటుగా అధ్యాపకుల లేరు. తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం కాలేజీలకి వీసీఐ గుర్తింపు ఉన్నా తగినంత మంది బోధనాసిబ్బంది లేక గరివిడి కళాశాలకు గుర్తింపు లభించలేదు. దీంతో ఆ కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇటీవల ఆందోళన చేయడంతో వర్సిటీ పరిధిలోని పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులను తాత్కాలికంగా డిప్యుటేషన్ చేశారు. ఈక్రమంలో త్వరలో 253 టీచింగ్ పోస్టుల (81బ్యాక్‌లాగ్ ఖాళీలతోపాటు) భర్తీకి అనుమతిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు. ఇందులోభాగంగా 56 ప్రొఫెసర్ పోస్టులు, 78అసోసియేట్, 119 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ అనుమతి లభించడంతో వర్సిటీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

త్వరలో స్విమ్స్‌లో రోబోటిక్ సర్జరీలు



విశ్వజ్యోతి వాత్సవను సన్మానిస్తున్న స్విమ్స్ అధికారులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో త్వరలో రోబోటిక్ సర్జరీలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. సర్జికల్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎంహాద్రి సత్యనారాయణరావు ఛైర్ ఓరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్జికల్ రోబోటిక్ టెక్నాలజీలో విశేష కృషి చేస్తున్న ఎస్ఎస్ఐ ఇన్నోవేషన్స్ ఆసియా పసిఫిక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ విశ్వజ్యోతి వాత్సవ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. డాక్టర్ విశ్వజ్యోతి వాత్సవ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతీ ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు జరుగుతాయన్నారు. ఆయన్ను స్విమ్స్ అధికారులు బంగారు పతకం అందించి సన్మానించారు. సత్యనారాయణరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రావు ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీన్ అలోక్ సచిన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్లా, ప్రిన్సిపల్ ఉషా కళావత్, వైద్య విభాగాధిపతులు నరేంద్ర, మణిలాల్ పాల్గొన్నారు.

ఇందిరా మార్కెట్లో పారిశుధ్యం అధ్వానం





మార్కెట్‌లో పారిశుధ్యం దయనీయతకు అద్దం పడుతున్న దృశ్యాలు



తిరుపతి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పేరేమో గొప్ప ఊరేమో దిబ్బ అన్న చందంగా తయారైంది తిరుపతి నడిబొడ్డున ఉన్న ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్. కార్పొరేషన్ అధికారులు ఏటా స్మార్ట్‌సిటీ అవార్డులు గొప్పగా స్వీకరిస్తారు. వాటిని అంతకంటే ఎక్కువగా ప్రచారం చేసుకుంటారు. ఏ ప్రాతిపదికన అవార్డులు ప్రకటిస్తున్నారో అంతుచిక్కడం లేదని ప్రజల్లో నానుతున్న పశ్న. అవార్డులు స్వీకరిస్తున్న ఆ అధికారులు ఒకసారి మార్కెట్‌ను సందర్శిస్తే వాస్తవం తెలుస్తుంది. ఇది పవిత్ర పుణ్యక్షేత్రమా, స్మార్ట్‌సిటీనా అని ఆశ్చర్యానికి గురికాక తప్పదు. ఎందు కంటే మార్కెట్ మురికివాడను తలపిస్తుంది. వాన పడిందంటే ఎగువన రోడ్ల నుంచి మురుగునీరు మార్కెట్‌ను ముంచెత్తుతుంది. మార్కెట్‌లోని రోడ్లన్నీ నలుపురంగు పులుముకుంటాయి. ఇక వ్యర్థాలతో అధ్వానంగా ఉంటాయి. మిగిలిన, పాడైన, వ్యర్థాలను తొలగించడానికి సకాలంలో వాహనాలు రావడంలేదు. రోజుల తరబడి నిల్వ ఉన్న వ్యర్థాలతో మార్కెట్ దుర్గంధంగా మారుతోంది. మార్కెట్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ పాడైపోవడంతో ఈ దుస్థితి ఎదురవుతోంది. ఎన్ని ఫిర్యాదులు చేసినా నగరపాలక అధికారుల స్పందన శూన్యం.

లోతట్టు ప్రాంతాలపై దృష్టిపెట్టండి : ఎమ్మెల్యే


అలిపిరి వద్ద తెలుగు గంగ ఫిల్టర్ హౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో నగరవ్యాప్తంగా ఉన్న లోతట్టు ప్రాంతాలపై దృష్టిపెట్టాలని, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. తొలుత గొల్లవానిగుంటకు చేరుకోగా స్థానికులు చుట్టుముట్టారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో రోడ్లన్నీ వర్షపునీటితో మునిగిపోతున్నాయన్నారు. కల్వర్టు నుంచి మురుగునీరు పొంగి ఇళ్లమీదకు వస్తోందని తెలియజేశారు. అనంతరం కేశవాయనగుంట ప్రధాన రహదారిపైకి మజ్జిగకాలువ నుంచి వచ్చే డ్రైనేజీ నీటితో రోడ్డంతా మురుగుపేరుకుపోవడాన్ని పరిశీలించారు. రంగుమారిన నీరు సరఫరా అవుతోందని ప్రజలు ఆవేదన చెందడంతో ఆయన అలిపిరి ఫిల్టర్‌హౌస్‌ను సందర్శించారు. సురక్షితనీరు అందించాలని సిబ్బందికి సూచించారు. సైడు కాలువలు, అండర్‌డ్రైనేజీ, కాలువలు పూడికలు తీయడం, చెత్తవేయకుండా చూడడం వంటి సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం కారణంగా ఎదురయ్యే సమస్యలను తెలిపేందుకు 9866239916, 9553161407నంబర్లను సంప్రదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు శ్యామ్‌సుందర్, తులసీరామ్, గోమతి, రమణ, మహేష్, ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో మొంథా ప్రభావం


కేశవాయనగుంటలోకాలువల్లో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

తిరుపతి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం తిరుపతి నగరాన్ని తాకింది. మంగళవారం ఉదయాత్పూర్వం నుంచి జడివాన కురుస్తూనే ఉంది. బడిపిల్లలు ఇళ్లకే పరిమితమవగా ఉద్యోగులు, కూలీలు తడుస్తూనే పనులకు వెళ్తూ అవస్థలు పడ్డారు. కొంతమంది ఇళ్లకే పరిమితమయ్యారు. మరికొందరు ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. వాతావరణం పూర్తిగా చల్లబడడంతో చలి బాగా పెరిగింది. నిత్యవసర సరుకుల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో జనం గడప దాటారు. లోతట్టు ప్రాంతాల్లో నీరునిలిచాయి. డ్రైనేజీ కాలువలు జోరుగా ప్రవహించాయి. పురవీధులు, వాణిజ్య సముదాయాలు, ఇతర సందర్శక ప్రాంతాలు జన సంచారం లేక బోసిపోయాయి. కపిలతీర్థం, మాలాడిగుండం జలపాతాలు ఝమరిపించాయి. పొగమంచు సోయగం ఆకట్టుకుంది. పట్టణానికి తూర్పుగా ఉన్న అన్ని చెరువులు మొరవపోతున్నాయి. శేషాచల కొండ నుంచి వర్షపునీరు జోరుగా ప్రవహించడంతో కరకంబాడిరోడ్డులో అక్కడక్కడా ప్రవాహాలు ప్రజల రాకపోకలకు ఆటంకం కల్గించింది.


ఈదురు గాలులకు స్విమ్స్‌లో వాహనాలపై కూలిన చెట్లు

ఈదురు గాలులకు ఆస్పత్రుల్లో కూలిన చెట్లు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను తాకిడికి మంగళవారం వర్షంతోపాటు జోరుగా కురిసిన ఈదురు గాలులకు రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో పలు భారీ వృక్షాలు నేల కూలాయి. స్విమ్స్ పార్కింగ్‌లో నిలిపిన వాహనాలపై చెట్లు కూలడంతో కొన్ని వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. రుయాలో రోడ్లకు అడ్డంగా చెట్లు కూలడంతో రోగులు భయాభ్రాంతులకు గురయ్యారు. ఏకదాటిగా వర్షం కురవడంతో ఆస్పత్రుల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైద్య పరీక్షలకు సైతం బయటకు రాలేక అవస్థలు పడ్డారు. ప్రధానంగా టీబీ, జిరియాట్రిక్ వార్డుల్లోని రోగులతోపాటు చిన్నపిల్లల విభాగంలో చికిత్స పొందే చిన్నారులు చలిగాలులకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అయితే సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సహాయాన్ని అందిస్తూ రోగుల భద్రతపై దృష్టి సారించడంతో రోగులు కొంత ఉపశమనం పొందారు. అలాగే పాత ప్రసూతి ఆస్పత్రి రోడ్డు మీదుగా ఎస్వీ వైద్య కళాశాలకు వెళ్లే ప్రధాన మార్గంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలడంతో అటుగా వెళ్లే వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

వైభవంగా నవగ్రహ హోమం


హోమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి (కల్చరల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి కపిలేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం నవగ్రహ హోమం అత్యంత వేడుకగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలోని అంజనేయ స్వామి సన్నిధికి సమీపంలో ఏర్పాటు చేసిన వేదికలో ఈ హోమ పూజలు జరిగాయి. తొలుత నవగ్రహ ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. కలశ స్థాపన చేసి ప్రత్యేక పూజలు చేసి కర్పూర హారతులు సమర్పించారు. తర్వాత హోమ గుండం వెలిగించి తొలుత గణపతి పూజ చేసి నవ గ్రహ హోమ పూజను పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం హోమంలో పూర్ణాహుతి సమర్పించారు. బుధవారం నాటి కాలభైరవ స్వామి హోమ పూజను పురస్కరించుకుని సాయంత్రం యాగశాలలో విశేష పూజలు జరిగాయి. కలశ స్థాపన చేసి దీపారాధన నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్


రిబ్బన్ కత్తిరించి స్టూడెంట్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న నారాయణ ఏజీఎం శ్రీనివాసులు

తిరుపతి (విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక టాటానగర్‌లోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిబ్బన్ కత్తిరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో తాము నేర్చుకున్న విద్యా విషయ పరిజ్ఞానాన్ని అభ్యసనా సామగ్రి ద్వారా విద్యార్థులు చక్కగా వివరించారు. ఏజీఎం శ్రీనివాసులు వారిని ప్రశం సించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల ఆర్ఐ వసంత్, కో-ఆర్డినేటర్ గాయత్రి, వీపీ స్వప్న, ఏవో శిఖామణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

31న జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు ఎస్వీయూని ఎంప్లాయిమెంట్ ఆఫీసులో జాబ్ మేళా ప్రారంభం కానుంది. మూడు ప్రైవేట్ సంస్థలు ఈ మేళాకు హాజరవుతాయి. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఫార్మసీ చదువుకున్న వారు అర్హులు. ఇతర వివరాలకు 73968 83023 నెంబరులో సంప్రదించాలని నిర్వాహకులు శ్రీనివాసులు కోరారు.

చీటీల పేరుతో మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో లక్షల రూపాయలు మోసం చేసిన దుర్గసముద్రం గ్రామానికి చెందిన జయసింహారెడ్డి, సుమతి, మునికష్టారెడ్డి, వాసుదేవరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు జయచంద్ర తదితరులు కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జయసింహారెడ్డి తదితరులు రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు చీటీలు వేసుకుని నగదు చెల్లించకుండా 2015లో పారిపోయారన్నారు. 2023లో ఎస్పీకి ఫిర్యాదు చేయగా స్పందించలేదన్నారు. 2025లో మళ్లీ ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. వారిపై పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు. బాధితులు రఘురామిరెడ్డి, శాంతమ్మ, సారంగ పాణి నాయుడు, గోపాలకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

వడిత్యా శంకర్‌నాయక్ క్షమాపణ చెప్పాలి


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన, దళిత నాయకులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అక్టోబరు 26న మదనపల్లిలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ గిరిజన, దళిత నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కూటమి నాయకులపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. గిరిజన సలహామండలి సభ్యులు సుబ్బయ్య, టీడీపీ దళిత నాయకుడు సుధాకరయ్య, ఎస్టీసెల్ కార్యదర్శి మనోహర్ నాయక్, అక్కి అధ్యక్షుడు మోహన్, గిరిజన నాయకులు విజయ్‌నాయక్, ధనరాజ్, విజయకుమార్, చిట్టి పాల్గొన్నారు.

పరకామణి లెక్కలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: సీపీఎం

తిరునతి(ఆటోనగర్), అక్టోబరు 28 (అక్టోబరు28): తిరుమలలో శ్రీవారి పరకామణిలో జరిగిన అవినీతి వ్యవహారాలపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యులు కందారపు మురళి డిమాండ్ చేశారు. స్థానిక యశోధనగర్‌లోని సీపీఎం కార్యాలయవారం మంగళ వారం ఆయన మీడియాతో మాట్లాడారు. పరకామణి వ్యవహారంపై ఏపీ హైకోర్టు స్పందించడాన్ని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీలో జరిగిన అక్రమాల్లో బీజేపీ పాత్ర ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుత పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి భావోద్వేగానికి గురై తను ఉంటానో పోతానో తెలియదని, తనపై తీవ్ర ఒత్తెడి ఉందని మీడియా సమావేశంలో మాట్లాడటంపై భక్తుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, పి.సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మీ, జయంతి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో దుప్పట్ల పంపిణీ



తిరుపతి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో స్థానిక 38 డివిజన్ సింగాలగుంటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం టీడీపీ తిరుపతి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ సందర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దుప్పట్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్యనాయకులు రేవతి, సంతోష్, విశ్వనాధం, ఆముదాయ తులసి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల అడవుల్లో అరుదైన బల్లి

● వెంకటాద్రిగా నామకరణం



మంగళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండల్లో అరుదైన ఒక బల్లిజాతిని గుర్తించారు. దట్టమైన చందనపు అడవిలో చెట్టు బెరడు కింద దీనిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి వెంకటాద్రి స్లెండర్ గెక్కో అని పేరు కూడా పెట్టారు. పలుచని తొండలా కనిపించే బల్లిజాతి జీవి ఇది. హెర్పటోజోవా అనే అంతర్జాతీయ జర్నల్‌లో ఈ వివరాలను శాస్త్రవేత్తలు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజనల్ సెంటర్, కోల్‌కత్తకి చెందిన రెప్టిల్లా విభాగం, ఒడిస్సాలోని ఫకీర్ మోహన్ యూనివర్శిటీల శాస్త్రవేత్తల బృందం శేషాచలం అడవుల్లో దీనిని గుర్తించింది.

శ్రీవారిసేవలో ప్రముఖులు





అభిమానితో సెల్ఫీ తీసుకుంటున్న అజిత్ - అన్మోల్ అంబానీ, క్రిషా షా అంబానీ దంపతులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో, తమిళ హీరో అజిత్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీ, ఆయన సతీమణి క్రిషా షా అంబానీ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 8 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,842

తలనీలాలు సమర్పించినవారు: 25,125





తిరుమలకు శ్రీనివాసుడి దర్శనానికి వస్తున్న భక్తులకు విడవని వానలతో అవస్థలు తప్పడంలేదు. తల తడవకుండా గొడుగు విప్పితే ఈదురు గాలులకు తిరగబడిపోతున్నాయి. మరోవైపు చలి వణికిస్తోంది. ఆలయం పరిసరాల్లో మంగళవారం పగలు కనిపించిన దృశ్యాలు ఇవి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి ఆంధ్రజ్యోతి

అత్యవసర వేళ విధులకు డుమ్మా!

● పలు సచివాలయాలకు తాళాలు

● అందుబాటులో లేని అధికారులు, ఉద్యోగులు

● కలెక్టర్ పరిశీలనలో వెల్లడి



తడ మండలం పూడి సచివాలయానికి తాళాలు వేసి ఉండటాన్ని సెల్‌ఫోన్ లైటింగ్‌లో చూపుతున్న తహసిల్దారు

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాను ముంచుకొస్తున్న అత్యవసర వేళ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల్సిన పలువురు అధికారులు, ఉద్యోగులు డుమ్మా కొడుతున్నారు. గ్రామ సచివాలయాలకే కాదు మండల స్థాయి కార్యాలయాలకూ తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు జిల్లా అధికారులు ప్రయత్నిస్తే పలువురు అందుబాటులో వుండడం లేదు. కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలనలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. తుఫాను నేపథ్యంలో సోమవారం రాత్రి ఎంపీడీవోలు, తహసిల్దార్లు కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులూ విధుల్లో వుండాలని ఐదుగురికి చొప్పున డ్యూటీ వేశారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చిత్తూరు, నెల్లూరు జడ్పీల సీఈవోలతో కలసి మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. చిట్టమూరు ఎంపీడీవో స్థానికంగా లేరని, వాకాడులో ఉన్నట్లు గుర్తించారు. చిల్లకూరు ఎంపీడీవో అందుబాటులోకి రాలేదు. పుత్తూరు అధికారి తిరుపతిలో ఉన్నట్లు, సూళ్లూరుపేట స్పెషలాఫీసర్ సైతం అందుబాటులో లేరని కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు విషయం ఒకరి నుంచీ ఒకరికి సమాచారం వెళ్ళడంతో అందుబాటులో లేని అధికారులూ ఉరుకుల పరుగుల మీద కార్యాలయాలకు చేరుకున్నట్టు సమాచారం.

సచివాయాల్లోనూ అదే తీరు

ఇక సచివాలయాల్లో పరిస్థితి ఎలా ఉందోనని జిల్లా అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేశారు. తడ తహసిల్దారు రాత్రి 10.24 గంటలకు పూడి సచివాలయానికి వెళ్లగా తాళాలు వేసుంది. తర్వాత కారూరు సచివాలయానికి వెళ్లగా అక్కడ డ్యూటీ చేయాల్సిన సిబ్బంది లేకపోగా తుఫాను డ్యూటీతో సంబంధం లేని ఓ ఉద్యోగి మద్యం మత్తులో నిద్రిస్తున్నట్టు గుర్తించారు. ఆపై పెరియవట్టు సచివాలయానికి వెళ్లగా, అక్కడా తాళాలు వేసి ఉంది. చివరగా అండగుండాల సచివాలయం చేరుకోగా అక్కడే తాళాలే కనిపించాయి.

కలెక్టర్ ఆగ్రహం

సోమవారం రాత్రి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు తుఫాను విధులకు డుమ్మా కొట్టడం పట్ల కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు రాత్రింబవళ్ళు సమస్యాత్మక ప్రాంతాలు తిరుగుతుంటే క్షేత్రస్థాయిలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటారంటూ వారిని తీవ్రంగా మందలించినట్టు సమాచారం. విధులకు డుమ్మా కొట్టిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిసింది.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో బుధవారం జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ముఖ్యంగా చిట్టమూరు, ఓజిలి, కోట, వాకాడు, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, ఏర్లు, కాజ్‌వేల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా స్పెషలాఫీసర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ కంట్రోల్‌రూమ్‌కు వచ్చే అత్యవసర సమాచారాన్ని అధికారులకూ తెలియజేయాలన్నారు. డీఆర్వో నరసింహులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడూరు రైల్వేస్టేషన్‌లో సేద తీరుతున్న ప్రయాణికులు

విశాఖ- తిరుపతి మార్గంలో పలు రైళ్లు రద్దు

గూడూరు/తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తిరుపతి నుంచి వైజాగ్ వెళ్ళు పలు రైళ్ళు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. పూరీ ఎక్స్‌ప్రెస్ 30వ తేది వరకు రద్దు చేశామన్నారు. మంగళవారం బయలుదేరాల్సిన తిరుమల ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-కాకినాడల మధ్య నడుస్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశామని పేర్కొన్నారు. తిరుపతి-విశాఖ మధ్య నడిచే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశారు. దీంతో గూడూరు రైల్వే జంక్షన్ నుంచి ప్రయాణించేవారు ఇబ్బంది పడ్డారు. ఆయా రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

వర్ష ప్రభావ ప్రాంతాల్లో ఎమ్మెల్యేల పర్యటన



తిరుపతి గొల్లవానిగుంటలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



రామచంద్రాపురం మండలం రామాపురం పంచాయతీ ఎస్టీ కాలనీలో ఇల్లు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



విడవని వర్షం నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి ఎస్టీకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి



సూళ్లూరుపేట మండలంలోని దొండకాలువ వంతెనపై ప్రవాహ ఉధృతిని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ



ముసురువానతో ఇబ్బంది పడుతున్న వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ఎస్టీ కాలనీవాసులకు ఆహారాన్ని అందజేస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావిత ప్రాంతాల్లో భారీ వాహనాల రాక పోకలపై ఆంక్షలు విధించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం తెలిపారు. మంగళవారం రాత్రి7గంటల నుంచి భారీ వాహనాలను జాతీయ రహదారుల వెంట ఉన్న హోల్డింగ్ ప్రాంతాల్లో ఆపుతున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసమే ఈ ఆంక్షలని స్పష్టంచేశారు. తక్షణ సాయం కోసం డయల్ 112 లేదా వాట్సాప్ నెంబరు 8099999977 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

భయం గుప్పెట్లోనే తీరప్రాంతాలు

● బిక్కుబిక్కుమంటున్న స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాలు

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని సముద్రతీరప్రాంత..మత్స్యకార గ్రామాలు భయం గుపెట్లోనే ఉన్నాయి. మంగళవారం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం గ్రామాల్లో సముద్రం అలజడులతో ఆందోళన చెందారు. గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం కసురుపై ఉంటూ పెద్ద ఎత్తున అలలు వచ్చాయి. నాలుగో రోజూ చేపలు పట్టేందుకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేదు. 12 గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంచార జీవులను కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో చేర్చి వారికి సహాయక చర్యలు చేస్తున్నారు.

తెలుగుగంగ కాలువలో కొట్టుకుపోయిన షరీఫ్ మృతదేహం లభ్యం

వరదయ్యపాళెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పసివాడి ప్రాణాలు కాపాడాలన్న తపనతో కాలువలో దూకి కొట్టుకుపోయిన డ్రైవర్ మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఈనెల 26న ఆదివారం సాయంత్రం ఉబ్బలమడుగు జలాశయం సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఇరిగేషన్ ఏఈ బాబు తన కారు కడగడానికి మనవడు మహిత్, డ్రైవర్ షరీఫ్‌తో వెళ్లారు. కారు కడుగుతుండగా మహిత్ కాలువలో పడిపోవడంతో రక్షించడానికి దూకిన షరీఫ్ కొట్టుకుపోయిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈనెల 27న సోమవారం మహిత్ మృతదేహం లభ్యం కాగా మంగళవారం చెట్టుకు ఇరుక్కున్న షరీఫ్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వెలికి తీశారు. కాగా షరీఫ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబీకులు భోరున విలపించారు.

పరకామణి చోరీ ఘటనపై హైకోర్టులో మరో పిల్

● రవికుమార్ వ్యవహారంపై సీబీఐ లేదా రిటైర్డు జడ్జితో విచారణ జరపాలన్న శాప్ ఛైర్మన్

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో రవికుమార్ చోరీకి పాల్పడిన వ్యవహారం అంతకంతకూ వేడెక్కుతోంది. ఇప్పటికే దీనిపై దాఖలైన ఓ ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరుపుతుండగా తాజాగా మరో పిల్ దాఖలైంది. ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు జరపాలని కోరుతూ ఈసారి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు హైకోర్టును ఆశ్రయించారు. కోట్లాది మంది భక్తుల కానుకలకు, మనోభావాలకు సంబంధించిన ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఏపీ పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులను సభ్యులుగా నియమించాలని కోరారు. లేకుంటే సీబీఐకి లేదా రిటైర్డు హైకోర్టు జడ్జితో విచారణ కమిషన్ అయినా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. పరకామణిలో చోరీ ఘటనపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 24-2023 క్రైమ్ నంబరుతో నమోదైన కేసును తిరుపతి కోర్టులో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవడం వెనుక పెద్ద కుట్ర దాగివుందని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవంగా ఏమి జరిగిందో తేల్చేందుకు లోతుగా సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరముందని, ఆ దిశగా ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరారు. రవి నాయుడు దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని, సీబీఐని, ఏపీ ప్రభుత్వాన్ని, దేవదాయ శాఖను, హోమ్ శాఖను, డీజీపీని, టీటీడీ ఈవో, టీటీడీ సీవీఎస్‌వోలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. రవినాయుడు మంగళవారం దాఖలు చేసిన పిల్‌పై ఆయన తరపున సీనియర్ న్యాయవాదులు మెస్సర్స్ ఉమేష్ చంద్ర, వడ్డి సోమశేఖర్, కర్రా మాధవి, కె.హరికృష్ణ తదితరులు హైకోర్టులో వాదనలు వినిపించనున్నారు.

భార్య ఆచూకీ కోసం వెతుకులాట

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన భార్య కోసం 20రోజులుగా వెతుకుతున్నాడో భర్త. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా... మహబూబ్ నగర్ జిల్లా కొత్తూరు మండలం మేకగూడకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి విజయలక్ష్మి, దంపతులు ఈ నెల 6న తిరుమల వచ్చారు. దర్శనానంతరం వీరు ట్యాక్సీలో తిరుపతి చేరుకున్నారు. నగరంలోని గరుడ వంతెన మూడో పిల్లర్ వద్ద ట్యాక్సీ దిగారు. ట్రాఫిక్ రద్దీలో రోడ్డు దాటుతుండగా విజయలక్ష్మి కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన చంద్రశేఖరరెడ్డి దాదాపు వారం రోజుల పాటు వెతికారు. ఫలితం లేకపోవడంతో ఈ నెల 16న ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. మతి స్థిమితం లేని తన భార్య ఆచూకి కోసం అప్పటి నుంచి ఆమె భర్త కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నాడు. పోలీసులను ప్రాధేయపడుతూనే ఉన్నాడు. ఇంతవరకూ వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని చంద్రశేఖరరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

గొడుగుల కింద వ్యాపారం

మంగళవారం జడివాన కురుస్తుండటంతో తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో వ్యాపారులు ఇలా గొడుగుల కింద వ్యాపారం చేశారు. కొనుగోలుదారులు గొడుగులు వేసుకుని రాగా.. మరికొందరు తడిచిపోయారు.



లోపలకు వెళ్లొద్దు



కొద్ది రోజులుగా తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షంతో ఎవరినీ లోపలకు వెళ్లనీయకుండా ఇలా బారికేడ్లు పెట్టారు.

వెంటాడిన మృత్యువు

● రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



రవికుమార్ మృతదేహం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో జరిగిన ప్రమాదంలో కావలికి చెందిన రవికుమార్(56) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కావలికి చెందిన రవికుమార్ కారును డ్రైవ్ చేసుకుంటూ మంగళవారం తెల్లవారుజామున చెన్నైకు బయలుదేరాడు. గూడూరు సమీపంలోని పారిచర్లవారిపాళెం వద్ద వేచివున్న ప్రయాణికుడు జావిద్‌ను కారులో ఎక్కించుకున్నాడు. నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో ఆగిఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. చిన్నపాటి గాయాలతో బయటపడ్డ రవికుమార్, జావిద్ బయటకు వచ్చి కారును పరిశీలిస్తుండగా ఆ మార్గంలో వెళ్తున్న మరో లారీ రవికుమార్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐసీఎస్ ఎంపిక పోటీలు వాయిదా

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆలిండియా సివిల్ సర్వీస్(ఏఐసీఎస్) క్రీడా పోటీలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈమేకు సంబంధిత సివిల్ సర్వీస్ అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు!



విచారణాధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి

రేణిగుంట అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం తనిఖీలు జరిగాయి. ఈ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. నెల్లూరు డీఐజీ మునిశంకరయ్య నేతృత్వంలో అధికారుల బృందం మధ్యాహ్నం 11.30 నుంచి 1.30 గంటలదాకా కంప్యూటర్లలోని సమాచారాన్ని పరిశీలించారు. ఈసమయంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డి వారి వెంటే ఉన్నారు. కొందరు ప్రయివేటు వ్యక్తులు కూడా కార్యాలయంలో ఉన్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం: కలెక్టర్



తూపిలిపాళెం సముద్రతీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ప్రత్యేక అధికారి అరుణ్‌బాబు, ఎస్పీ సుబ్బరాయుడు

వాకాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను అన్ని విధాలుగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం వాకాడు మండలంలోని తుపిలిపాళెం సముద్రతీరాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా తుఫాన్ ప్రత్యేక అధికారి అరుణ్‌బాబు, ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. మంగళవారం రాత్రి తుఫాన్ తీరం దాటనునండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలకు తగిన వసతి కల్పించాలన్నారు. కాగా, తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలలు ఎగిసిపడుతున్నాయి. అధికారుల హెచ్చరికలతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. సముద్రతీరం వద్ద పోలీసులు, రెవెన్యూ, మెరైన్ పోలీసుల నిఘాలోనే ఉంది. కార్తీకమాసం కావడంతో పర్యాటకులు, భక్తులు సముద్రంలోకి వెళ్లనీవ్వకుండా పహారా కాస్తున్నారు. తూపిలిపాళెం, కొండూరుపాళెం, శ్రీనివాసపురం, మనపాళెం, పూడిరాయ దొరువు సముద్రతీరంలో 10 మీటర్ల మేర సముద్రం ముందుకురావడంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



స్వర్ణముఖిబ్యారేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

వాకాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తుఫాన్ తీరం దాటనునండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. స్వర్ణముఖి బ్యారేజీని పరిశీలించి, బాలిరెడ్డిపాళెం ముంపు ప్రాంతంలో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. బాలిరెడ్డి పాళెం ఎస్టీకాలనీవాసులకు ఆహారం అందజేశారు. అనంతరం తూపిలిపాళెం సముద్రతీరంలో అలల ఉధృతిని పరిశీలించి మత్స్యకారులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, టీడీపీ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

7 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనేపల్లి దళితవాడలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల సమాచారం మేరకు... పాకం వీరయ్య, సుభద్ర దంపతులు మాంబట్టు పారిశ్రామికవాడలోని అపాచి బూట్ల కర్మాగారంలో పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం భార్య, భర్తలిద్దరూ ఇంటికి తాళం వేసి కంపెనీకి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి 7 సవర్ల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గోపి నాయక్

బాలాయపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి గోపి నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని నిండలి, రామాపురం వద్ద ఉన్న కైవల్యా నది బ్రిడ్జి వరద ప్రవాహాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వంతెనల వద్ద ఎలాంటి ప్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఎస్‌ఐ గోపీ, ఏవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నరసింహారావు, మండల ప్రత్యేక అధికారి రమేష్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కాగా, పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు 4 సెంటీమీటర్లు వర్షం కురిసిందని అధికారులు తెలిపారు.

గిరిజనులకు టీడీపీ నేతల సాయం



కేశవరంలోని నక్కలోళ్లకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులకు గురైన గిరిజనులకు టీడీపీ నాయకులు సాయం అందించారు. కేశవరం పంచాయతీ పరిధిలో ఉన్న నక్కలోళ్ల కాలనీలో 500మందికి చిట్టేడు సహకార సంఘం చైర్మన్ చాపల శ్రీనివాసులు, టీడీపీ బూత్ కన్వీనర్ కోకోలు భూపతి దాతృత్వంతో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, కోటమ్మగుడి కాలనీల్లోని గిరిజనులకు జలీల్ అహ్మద్ దాతృత్వంతో పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్, నౌషాద్‌బాషా, తిరుమలశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గురవయ్య(38) మృతి చెందాడు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన గురవయ్య విజయవాడకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాయుడుపేటలో దిగాడు. విన్నమాల వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గురవయ్య మృతి చెందాడు. ఆయన భార్య సుఖన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఎడతెరపిలేని ముసురు



ఓజిలి: మామిడికాలువను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, అధికారులు

తడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి ముసురు పట్టినట్లుగా వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం వరకు ముసురు కొనసాగింది. దీనికి చలి గాలులు తోడవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. తడ మండలంలో కరిపేటి కాలువ, పాముల కాలువ నిండుగా ప్రవహిస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా 9 చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెరియవట్టు దళితవాడ ప్రజలకు ఆహార పొట్లాలను సరఫరా చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఇక కాళంగి నదికి గత ఏడాది వాటంబేడు వద్ద పడిన గండిని ఇసుక బస్తాలతో పూడ్చివేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ముంపు ప్రాంతాలైన కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, తడ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వెండ్లూరుపాడు, కాదలూరుల మధ్య రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. మంగళ, బుధవారాలలో పరిశ్రమలకు సెలవు ప్రకటించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు జాతీయ రహదారుల్లో ప్రయాణిస్తున్న కంటైనర్ వంటి భారీ వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు.

సూళ్లూరుపేట: పట్టనంలో మంగళవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. అధికారులు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులతో కలిసి ఇలుపూరు - మంగళంపాడు మధ్యనున్న దొండ కాలువను పరిశీలించారు. దొండకాలువ వంతెనపై రెండు అడుగుల మేర నీరు పారుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరప్రాంత గ్రామాల్లో పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీరం దాటి వర్షం ఆగే వరకు అధికారులు అప్రమత్తం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, తహసీల్దార్ గోపీనాథ్ రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, టీడీపీ నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, మాధవ నాయుడు, సతీష్ పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలో మంగళవారం ఎడతెరపిలేకుండా తేలికపాటి వర్షం కురిసింది. కుంటలు, చెరువులకు పూర్తిస్థాయిలో నిండాయి. పంట పొలాలు చెరువుల్లా మారాయి. కాలువలు, దొరువులు, కలుజులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఓజిలి మండలంలోని మానమాల, ఓజిలి గ్రామాల్లో పర్యటించారు. మానమాలకు సమీపంలోని మామిడికాలువ కాజ్‌వేను పరిశీలించి రాకపోకలు ఆపివేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడ పాఠశాల వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. ఓజిలి పెద్దచెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరిన నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆర్డీవో వెంట తహసీల్దారు పద్మావతి, అధికారులు ఉన్నారు. కాగా, గ్రద్ధగుంటలో గిరిజనవాసులకు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించారు.

దొరవారిసత్రం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. వర్షాలు ఎక్కువైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించేందుకు తహసీల్దారు శైలాకుమారి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. పులికాట్ తీరంలోని కారికాడు, వేలికాడు, మీజూరు గ్రామాల పాఠశాల భవనాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే పూలతోట, తల్లంపాడు పాఠశాలల్లోనూ పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తనియాలి వద్ద కాళంగి నదిపై వంతెనను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎస్‌ఐ అజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మాధవ్, నాగేంద్ర నాయుడు, అలవల శీనయ్య, తదితరులు ఉన్నారు.

గూడూరు: మొంథా తుఫాన్ ప్రభావంతో పట్టణంలో మంగళవారం వేకువ నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, ఐసీఎస్‌రోడ్డు, అంబేడ్కర్‌నగర్ అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిల్వచేరడంతో వాహనదారులు, పాదాచారులు అవస్థలు పడ్డారు. విందూరు, చెన్నూరు గిరిజనకాలనీల్లోని ప్రజలను సమీప పాఠశాలల్లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. అధికారులు, స్థానిక నేతలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆహార పొట్లాలను అందజేశారు.

చిల్లకూరు: మండలంలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. అధికారులు, టీడీపీ నాయకులు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే తమ్మినపట్నం, తిక్కవరం, కలవకొండ, ఓడూరు, ఉడతావారిపార్లపల్లి గ్రామాల్లోని గిజనకాలనీవాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. తిక్కవరంలో తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి సహకారంతో గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు. ఓడూరులో గుండాల లీలావతి, చిట్టేటి కీరవాణి, ఉడతావారిపార్లపల్లి సర్పంచు త్రివిక్రమ్ భూపతి, కుమార్ యాదవ్, భాస్కర్, కలవకొండ నెలటూరు చిరంజీవి, తమ్మినపట్నం సతీష్‌యాదవ్ సహకారంతో ఆయా గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు.

కోట: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు నిండుతున్నాయి. గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి, మామిడి కాలువ పరవళ్లు తొక్కుతున్నాయి. గూడలి, రాజుపాళెం, వెంకన్నపాళెం, తిన్నెలపూడి, దక్షిణపాలెం గ్రామాల్లో నారుమడులు నీట మునిగిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి తుఫాన్ తీరం దాటనున్న నేపథ్యంలో మత్స్యకార గ్రామాలైన గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం, కొత్తపట్నం, గున్నంపడియ గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలు భయం గుప్పెట్లోనే ఉన్నాయి. శ్రీనివాససత్రం వద్ద సముద్రం భీకర శబ్దాలతో అలల ఉధృతి పెరుగుతుండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.



దొరవారిసత్రం: తనియాలి కాళంగి నది వంతెన వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తహసీల్దారు జయజయరావు, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్‌ఐ ప్రసాద్‌తో పాటు వీఆర్వోలుసముద్రతీరప్రాంత గ్రామాలను సందర్శించారు. గోవిందపల్లివద్ద ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ ఉధృతి, పుచ్చలపల్లి వద్ద ఉన్న స్వర్ణముఖి నది ప్రవాహాలను పరిశీలించి ముంపుగ్రామాలవాసులకు భరోసా ఇచ్చారు.

పెళ్లకూరు: స్వర్ణముఖినది, పాలచ్చూరు కాలువలు, తెలుగుగంగ కాలువలు, వాగులు, కలుజులు పారుతుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. పాలచ్చూరు గిరిజన కాలనీకి చెందిన యాకసిరి సునీత, తుపాకుల రంగమ్మకు చెందిన రెండు పూరి గుడిసెలు నేలకూలాయి. స్వర్ణముఖినదికి భారీగా వరదనీరు చేరుతోంది. మండలంలోని చెరువులు, వాగులు, వంకలు, కలుజులు పారుతున్నాయి. తహసీల్దార్ హరికృష్ణ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. కొత్తూరు, కానూరు, మోదుగులపాలెం, పాలచ్చూరు, నవటకండ్రిగ, ముమ్మారెడ్డిగుంట, సవటకండ్రిగ, భీమవరం ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు చిల్లకూరు వడ్డిపాలెం బీసీ కాలనీలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. శిరసనంబేడు చెరువు పూర్తిగా నిండి ప్రమాదకరంగా మారడంతో ఇరిగేషన్ డీఈ విశ్వనాథ్, ఏఈ శ్రీనివాసులు ఎక్స్‌కవేటర్‌తో కట్టను తెగ్గొటి నీటిని దిగువకు విడుదల చేశారు. కొత్తూరు గిరిజన కాలనీవాసులను టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య అధికారులతో కలసి పునరావాస కేంద్రాలకు తరలించారు. పాలచ్చూరు ఎస్టీ కాలనీలో కూలిన పూరి గుడిసెలను బీజేపీ నేతలు మునిసుబ్రహ్మణ్యం, ఎద్దల నరేంద్రరెడ్డి పరిశీలించారు. మంగళవారం అర్ధరాత్రి తుఫాన్ తీరం దాట నుండడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఆర్‌అండ్‌బీ డీఈ మహేశ్వరి తెలిపారు.

నాయుడుపేట: మండలంలో తేలికపాటి వర్షం కురుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మునిరత్నంనగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలు, మేనకూరు, పుదూరు, భీమవరం, చిలమత్తూరు, అన్నమేడు, బట్టివిడత, వాసుదేవపురంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాయుడుపేట - మేనకూరు వద్ద మామిడి కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.



నాయుడుపేట: మేనకూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి కాలువ







చిల్లకూరు: తిప్పగుంటపాళెం ఉప్పుటేరు చప్టాపై వరద - పెళ్లకూరు: కొత్తూరు గిరిజన కాలనీలో అధికారులు, టీడీపీ నాయకులు - బాలాయపల్లి: నిండలి వద్ద కైవల్యానది బ్రిడ్జిపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోతులమయంగా గూడూరు - వేములపాళెం రోడ్డు



గూడూరు బీసీ కాలనీ సమీపంలో వేములపాళెం రోడ్డుకు గోతులు

గూడూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి మండలంలోని వేములపాళెం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో 15కు పైగా గుంతలు ఏర్పడి వర్షపునీరు నిల్వ చేరడంతో మడుగులను తలపిస్తున్నాయి. మండలంలోని విందూరు, రామలింగాపురం, సంతదాసుపల్లి, ఈదలపల్లి, మిటాత్మకూరు తదితర గ్రామాల ప్రజలు వివిధ పనులపై గూడూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా వేములపాళెం మీదుగానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అయితే గూడూరు నుంచి వేములపాళెం వెళ్లే రహదారి గోతులమయంగా మారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయానించాలంటే ఇబ్బందికరంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా గూడూరు బీసీ కాలనీ, మల్లితోట వాటర్‌వర్క్స్ ప్రాంతం, మధురెడ్డికాలనీ, వేములపాళెం సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారిందని చెబుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలలు కోరుతున్నారు.

రోడ్డంతా గుంతలే



అమ్మపాళెం వద్ద గోతులు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - గూడూరు రోడ్డు గుంతమయంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే నరకప్రయాణంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు చేరి గుంతలు ఎక్కడ ఉన్నాయో కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రొచ్చురొచ్చుగా మున్సిపాలిటీ రోడ్డు



అడుసులా ఆనందపురం వద్ద రోడ్డు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నుంచి చెలికంపాటు, మన్నెగుంట, కుర్జాగుంట, మన్నవరం తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రధానంగా సుభాష్ చంద్రబోస్ సర్కిల్ నుంచి ఆనందపురం వరకు 400మీటర్లు గుంతలమయంగా మారింది. ఇటీవల వర్షాలతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 9వ బెటాలియన్‌లో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గోతిలో దిగిన ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన ప్రమాదం

కోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కోట మండలం క్రాస్‌రోడ్డులో చల్లకాలువ వంతెన వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు గోతిలో దిగి పక్కకు ఒరిగిపోయింది. వాకాడు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు సర్వీసు నాయుడుపేట నుంచి ప్రయాణికులతో విద్యానగర్ మీదుగా కోటకు బయలుదేరింది. క్రాస్‌రోడ్డులో చల్లకాలువ వంతెన వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కేబుల్ కోసం తవ్విన గోతిలో దిగి పక్కకు వాలిపోయింది. బస్సులో ఉన్న నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



గుంతలో దిగి పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

గిరిజనులకు ఆహార పొట్లాల పంపిణీ



గిరిజనులకు ఆహార పొట్లాలను అందజేస్తున్న సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతట్టు గిరిజన కాలనీల్లో ప్రజలకు ఆహార పొట్లాలను అందించారు. చెన్నూరు గిరిజనకాలనీలోని గిరిజనులను సమీప పాఠశాలలో పునరావాస కేంద్రానికి తరలించారు. వారికి తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి భోజన వసతి కల్పించారు. పోటుపాళెం గిరిజనకాలనీలో గిరిజనులకు విజయ దుర్గాదేవి ఉపపీఠం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆహార పొట్లాలు, గొడుగులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని విందూరు ఎస్టీకాలనీ సమీపంలోని పాఠశాలలో ఎస్టీ కాలనీవాసులకు అధికారులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజనం వసతులను కల్పించారు. ఈ కేంద్రాన్ని తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, డీఎల్‌డీవో వాణి పర్యవేక్షించారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ చిన్నయ్య పర్యటించారు. పట్టణంలోని సాయినగర్, ఇందిరాగనగర్, మహదేవయ్య నగర్, ఇసుకమిట్ట, మన్నారుపోలూరు ప్రాంతాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లు, బోర్డులు, ఫ్లెక్సీలను తొలిగించారు.



నెర్రికాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ చిన్నయ్య

శ్రీసిటీలో రక్తదాన శిబిరం



సత్యవేడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్, తిరుపతి ఎస్వీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శ్రీసిటీ పోలీసులు మంగళవారం శ్రీసిటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసిటీ డీఎస్పీ టీవీ శ్రీనివాసులు, ఎస్వీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ హరికుమార్ రెడ్డి, బాలచంద్రనాయుడు సమక్షంలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి లాంఛనంగా శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ హరికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం ఏర్పాట్లను శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ పర్యవేక్షించారు. క్రియా యూనివర్శిటీ, ఏజీఐ, ఆల్‌స్టోమ్స్, అపోలో టైర్స్, సీఈటీసీ, డైకిన్, ఈప్యాక్, ఐఎఫ్ఎఫ్, ఇసుజు, కొబెల్కో, కూల్ కింగ్, టిల్ పరిశ్రమల ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది 175 మంది రక్తదానం చేశారు. శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ అరుణ్‌కుమార్ు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆకాశదీపం


దీపానికి పూజ చేస్తున్న గుర్రప్పశెట్టి

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆకాశదీపాన్ని భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన ముక్కంటి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు, ధర్మకర్తలమండలి సభ్యుడు గుర్రప్పశెట్టి తదితరులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సూచనలిస్తున్న డాక్టర్ బాబు

శ్రీకాళహస్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పట్టణవాసులు అప్రమత్తంగా ఉండాలని శ్రీరామ్‌నగర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ బాబు తెలిపారు. ఆయన సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై ఉంటుందన్నారు. అలాగే నిల్వ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలకు డయేరియా, టైఫాయిడ్ ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు 15రోజుల లోపు డెలివరీ అయ్యే గర్భిణులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి ముందస్తుగా తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

చౌటూరు పునరావాస కేంద్రానికి గంగమాంబపురంవాసుల తరలింపు


చెరువు కట్టను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతమైన గంగమాంబపురంవాసులను చౌటూరు పునరావాస కేంద్రానికి తరలించినట్టు కమిషనర్ మంజునాథ్ గౌడ్ చెప్పారు. మంగళవారం వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీఈ లోకేష్, ఏఈ రమేష్‌తో కలిసి పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. స్థానిక చెరువు కట్టను పరిశీలించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సాధారణ పరిస్థితికి వచ్చే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది, పురపాలక సిబ్బంది అందుబాటులో ఉంటామన్నారు.

పశువులు మరణిస్తే సచివాలయంలో నమోదు చేయించాలి

పుత్తూరు టౌన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల కారణంగా పశువులు, మూగజీవాలు మరణిసే పరిహారం కోసం సంబంధిత సచివాలయంలోని పశు సంవర్థక సహాయకులకు సమాచారం అందించాలని వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ కె.ప్రసూన పేర్కొన్నారు. మంగళవారం గోపాలకృష్ణాపురంలో పాడి రైతులకు, గొర్రెల పెంపకందారులకు పలు సూచనలు చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఆరుబయట మేతకు తీసుకు వెళ్లవద్దన్నారు. కొట్టాల్లో పశువులను, చిన్న జీవాలను ఉంచరాదని తెలిపారు. పశువైద్యాధికారి దివాకర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ గౌతమి, డిజిటల్ అసిస్టెంట్ జయంతి, వెల్ఫేర్ అసిస్టెంట్ జాస్మిన్ పాల్గొన్నారు.

నేత్రపర్వం... సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



పుత్తూరు టౌన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కంద షష్టి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వర, కలశ పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమ, మంగళవారాల్లో తుఫాను ప్రభావం లేదన్నారు. బుధవారం పరిణామాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. వంకలు, వాగులు, లోతట్టు ప్రాంతాలకు ఎటువంటి పరిస్థితుల్లో వెళ్లరాదని సూచించారు. నియోజకవర్గ అధికారులు ప్రమాదకర ప్రాంతాల్లో అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలన్నారు. చెరువులు, కాలువల వద్ద పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రహదారులపై వరద నీరు ప్రవాహం సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులతో పాటు తాను అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు వ్యవహరించాలన్నారు.

వాగులను దాటొద్దు


నిండు కుండలా గూళూరు చెరువు

వడమాలపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జరీనా చెప్పారు. మండలంలోని గాజులమద్యం పారిశ్రామికవాడ నుంచి కల్లూరుకు వెళ్లే రోడ్డులో పొంగిపొర్లుతున్న నక్కలవాగు, ఎస్బీ ఆర్‌పురం సమీపంలోని గూళూరు చెరువు వద్ద, సీతారామపురం చెరువు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాగులను ఎట్టిపరిస్థితుల్లో దాటొద్దని సూచించారు. మండలంలో మంగళవారం ఉదయం వరకు 19.08 మి.మీ వర్షపాతం నమోదైనట్టు తెలిపారు. మండలంలోని గూళూరు చెరువు నిండుకుండలా మారింది. గత వర్షాలకే నిండిన చెరువులోకి ప్రస్తుతం కురుస్తున్న వానలకు అదనంగా నీరు వచ్చి చేరుతోంది. తూములకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

రేణిగుంట అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు రేణిగుంట- తిరుపతి రోడ్డు మార్గంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వెంటనే స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన స్తంభాలను నిలబెట్టి సరఫరా పునరుద్ధరించారు.

తూర్పున ముసురు వాన




సీఎల్ఎన్ పల్లె సమీపంలో పాములకాలువ వద్ద, గుడిమల్లం సీతకాలువ వద్ద అధికారులు, పోలీసుల పహారా - కొత్తవీరాపురం, మోదుగులపాళెం గ్రామాల మధ్య స్వర్ణముఖి కాలువ వద్ద హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు

శ్రీకాళహస్తి,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో మంగళవారం ముసురు వాతావరణం నెలకొంది. వేకువ జాము నుంచి రాత్రి వరకు విడవకుండా తేలికపాటి జల్లులు కురిశాయి. అధికార యంత్రాంగం మొత్తం మొంథా తుఫాన్ హెచ్చరికతో ముందస్తు చర్యల్లో భాగంగా అప్రమత్తంగా వ్యవహరించారు. లోతట్టు ప్రాంతాలైన పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీ, లంకమిట్టప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఇక శ్రీకాళహస్తి మండలం వేడాం ఎస్టీకాలనీ, భైరవ ఎస్టీకాలనీ ప్రజలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు తరలించి భోజన సదుపాయం కల్పించారు. వర్షం తీవ్రత లేకపోవడంతో విద్యుత్ సరఫరా కూడా ఎలాంటి అంతరాయం ఏర్పడలేదు. ఎమ్మెల్యే సుధీర్ శ్రీకాళహస్తి మండలంలోని ముళ్లపూడి ఎస్టీకాలనీ, పట్టణ శివార్లలోని దొమ్మరపాళెం వద్ద ఉన్న కాజ్‌వేలను పరిశీలించారు. శ్రీకాళహస్తిలో 21.2 మి.మీ.వర్షపాతం, తొట్టంబేడులో 21.3మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షం హెచ్చరిక కారణంగా ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. విద్యాసంస్థలు కూడా సెలవు పాటించాయి. దీంతో మంగళవారం చిరువ్యాపారాలు మందగించాయి.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి నచ్చనేరి గిరిజన కాలనీలో ఆరు గుడిసెలు కూలాయి. తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం కాలనీలో పర్యటించారు. అనంతరం వారిని దుర్గిపేరి ప్రభుత్వ పాఠశాలలోకు తరలించారు. అదే విధంగా వెంకటపాళెంకు చెందిన 20 కుటుంబాలను, శివగిరి గిరిజనకాలనీకి చెందిన ఓ కుటుంబాన్ని సమీప ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోకి తరలించి భోజన వసతి కల్పించారు. అదే విధంగా అంజిమేడులో మహిళా పాడి రైతు గీతకు చెందిన ఆవు మేత మేసి ఇంటి కి వస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మోదుగులపాళెం, కొత్తవీరాపురం మధ్య ఉన్న స్వర్ణముఖి లోలెవల్ వంతెనను, గుడిమల్లం వద్ద ఉన్న సీత కాలువ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకానగర్ కాజ్‌వేని తహసీల్దార్ హనుమాన్ నాయక్ తనిఖీ చేశారు. అరణియార్ ప్రాజెక్టులో నీటిమట్టం 28 అడుగులకు చేరిన నేపథ్యంలో గేట్లను తెరిచి నీటిని విడుదల చేశారు. అరుణానది పరీవాహక ప్రాంతంలోని ద్వారకానగర్ కాజ్‌వేపై నీరు ఉధృతంగా ప్రవహించే అవకాశాలున్నాయన్నారు. ఈక్రమంలో కాజ్‌వేకి ఇరువైపులా ముళ్లకంపలతో కంచె వేసి ఎర్రజెండాలను నాటారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మండలంలో పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి అక్కడ భోజన వసతి కల్పించారు. గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాల తదితర చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. సీఎల్ఎన్ పల్లె సమీపంలో పాముల కాలువ దాటకుండా కంచె వేశారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో రోజంతా చినుకులు పడుతూ మోస్తరు వర్షపాతం నమోదైంది. తుఫాను ప్రభావం మండలంలో పెద్దగా కనిపించకపోయినప్పటికీ లోతట్టు ప్రాంతాల్లో తహసీల్దార్ రాజశేఖర్, ఎస్ఐ రామస్వామి సిబ్బందితో కలిసి పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా బాలగోపాలపురం, దాసుకుప్పం, వీఆర్ కండ్రిగల్లోని గిరిజనులు, షికారీల కుటుంబాలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి అన్న పానీయాలు అందించారు. గర్భిణులను తిరువళ్ళూరు, ఎగ్మోర్, తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రులకు తరలించారు. మరికొందరిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ వైద్య శాలకు తరలించారు.




దుర్గిపేరిలోని ప్రభుత్వ భవనంలో ఆశ్రయం పొందుతున్న గిరిజనులు - దాసుకుప్పం పునరావాస కేంద్రంలో గిరిజనులు - ద్వారకానగర్ కాజ్‌వేని పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమాన్ నాయక్ తదితరులు

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి: జడ్పీ సీఈవో


బీఎన్‌కండ్రిగ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

కేవీబీపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు చెప్పారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రాణ నష్టం జరగకుండా చూడాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం రాజుల కండ్రిగ, పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాలతి, ఈవోపీఆర్డీ జి.రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తుఫాన్ సహాయక చర్యలపై అధికారులకు జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావంతో తీరప్రాంతాల్లో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వాగులు, వంకలు, కాలువలు, కాళంగి నది పొంగి ప్రవహించే సమయంలో కరకట్టలు తెగే ప్రమాదం తలెత్తే అవకాశం ఉన్నందున ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈదురు గాలుల వలన విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగితే తొలగించాడానికి డోజర్లు, ఎక్స్‌కవేటర్, క్రేన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, తహసీల్దార్ శ్రీదేవి, వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, ఏఈ నాగరాజు, ఎంఈఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్వో

ఏర్పేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాలకు తరలించిన గిరిజనులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఏర్పేడు మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ బాబు అధికారులకు సూచించారు. దుర్గిపేరి ప్రభుత్వ పాఠశాలలోని పునరావాసకేంద్రంలో ఉన్న గిరిజనులను ఆయన పరామర్శించారు. వారికి వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచడం సంతోషకరమన్నారు. వర్షం తగ్గే వరకు ఇక్కడే ఉండాలని సూచించారు. తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, వీఆర్వో మునస్వామి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం



శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన భరద్వాజ తీర్థం పక్కనే ఉన్న ఎస్టీకాలనీలో మంగళవారం నవభారత్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ... మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి అన్నదానం చేశామన్నారు. రాజేశ్వరరావు, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

పనులను సకాలంలో పూర్తి చేయండి

వరదయ్యపాళెం అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పీఎజేఏవై పనులను సకాలంలోపూర్తి చేయాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కింద హరిజనవాడల అభివృద్ధికి రూ.20లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులను వినియోగించి బత్తవల్లం, పంచాయతీ చెదులుపాకొం, రాచర్ల, కడూరు, తొండూరు పంచాయతీల్లో పనులను పూర్తి తుఫాన్ ప్రభావిత ప్రాంతాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో అన్మోల్ అంబానీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం అనిల్ అంబానీ పెద్ద కుమారుడు అన్మోల్ అంబానీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ధర్మకర్తలమండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామిసన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. పాలకమండలి సభ్యులు గాదిపాకుల గోపీనాథ్, గుర్రప్పశెట్టి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పనిముట్లతో సులభతర వ్యవసాయం


సమావేశంలో మాట్లాడుతున్న దశరథాచారి

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పనిముట్లతో వ్యవసాయాన్ని సులభతరం చేయవచ్చని ఏపీ వారాహి ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ డైరెక్టర్ గుమ్మడిపూడి దశరథాచారి అన్నారు. మహారాష్ట్రలోని సేవగ్రాం పట్టణంలోని ఎంజీఐఆర్ఐ సంస్థలో రైతు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులకు కావాల్సిన పరికరాలను వివరించారు. దిగుబడులను గిట్టుబాటు ధరకు విక్రయించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాస్థాయిలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలన్నారు. తొట్టంబేడు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ జయచంద్రనాయుడు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

పూడి మట్టి వంతెనపై మళ్లీ నీటి ప్రవాహం



కేవీబీపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగ వద్ద పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెనపై నీరు పారుతోంది. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కట్ట మళ్లీ తెగే పరిస్థితికి వచ్చింది. ఇప్పటికే మూడు సార్లు మట్టి తోలారు. కాగా మంగళవారం రాత్రి భారీ వర్షం కురిస్తే కట్ట కొట్టుకుపోయే అవకాశం ఉంది.

వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండండి


పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్ల పంపిణీ

నారాయణవనం, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణవనం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కే.జీ. శారదమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామ పంచాయతీ జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలవడానికి కారణమైన పారిశుధ్య కార్మికులను ఆయన అభినందించారు. కార్మికుల కోరిక మేరకు వారి జీతం పెంపుదలకు ఆమోదం తెలిపారు. అనంతరం పారిశుధ్య కార్మికుల రెయిన్ కోట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీనయ్య, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.

కలుజులకు బొగడ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకంలో ఉన్న భైరవానిగుంట చెరువు తూము దగ్గర బొగడ పడింది. దీంతో చెరువులోని నీరంతా వృథాగా బయటకు పోతోంది. బొగడను పూడ్చడానికి రైతులు, అధికారులు ప్రయత్నిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వరి పంట నీట మునిగింది.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓళ్లూరు, పాతపాళెం మధ్య ఉన్న రాయల చెరువు నిండి కలుజు పారుతోంది. అయితే కలుజు పక్కన చిన్న బొగడ ఏర్పడిందని సర్పంచ్ సురేష్ తెలిపారు. సమాచారం అందుకున్న ఎంపీడవో మాలతి, తహసీల్దారు రోశయ్య, నీటిపారుదల అధికారి ఉదయ్ పరిశీలించారు. పెద్ద ప్రమాదం లేదని అధికారులు చెప్పారు.

వాగులో కొట్టుకుపోయి గేదె మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాలకు కాంపాళెం గ్రామానికి చెందిన మీరయ్య గేదె వాగులో కొట్టుకు పోయి మృతి చెందింది. మంగళవారం మేత కోసం గేదెలు తోలుకెళ్లారు. ఒక గేదె మేత మేస్తూ ఉధృతంగా ప్రవహిస్తున్న వరవ కాలువలోకి దిగడంతో కొట్టుకుపోయి మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సూమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపారు.